REGD : No. H 18 విడిప్రతి 0-20పై. 14-1-66 శుక్రవారం

# అపూర్వ ఆశాజ్యోతి ఆరిపోయింది!

జమీన్‌రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 38 ] సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి [ సంచిక 2

## ప్రధాని ఎవరు?




శాస్త్రిగారి ఆకస్మిక మరణం ప్రజా హృదయాలను ఎంత శోకవరితప్తంచేసినా, రాజ్యాంగ నిర్మాణకు సంబంధించిన ప్రశ్న తలెత్తక తప్పదు. అందుకే శాస్త్రి తర్వాత ప్రధాని ఎవరు? అనే సమస్యకు ఈ విషాద గాఢాంధకారంలోనే తప్పకుండా వలసి వస్తున్నది.

తాత్కాలిక ప్రధానిగా శ్రీ గుల్జారిలాల్ నందా 11 తేది తెల్లవారుఝాము 3 గంటలకు, అంటే శాస్త్రిగారు మరణించిన

— కొరవ 10వ పేజీలో

## అహరహంజరిగిన శాంతిచర్చలకు ఆత్మార్పణైన భారత ప్రధాని

# ప్రియతమ శాస్త్రీజీ మనకికలేడు, మనకికరాడు!



అవును, అపూర్వజ్యోతి ఆరిపోయింది. ప్రధాని శాస్త్రీజీ అస్తమించారు. తాష్కెంట్ నగర సమావేశమైనతర్వాత, శాంతి పొడం బడిక పత్రంమీద సంతకాలు అయిన తర్వాత హృద్రోగం ముంచుకొచ్చి హఠాత్తుగా కన్నుమూశారు. ఒకదేశ ప్రధాని మరొక దేశంలో మృతిచెందడం ప్రపంచచరిత్రలో బహుశా అరుదైనసంఘటన. ఎన్నడూ విదేశాల్లో అంతగా పర్యటించనివ్యక్తి వొక విదేశగడ్డమీద శాంతి కోసం చర్చలుజరిపి, దారులుతీసి, కలలుగని, ఆఖరుక్షణంలో విశ్వసౌరుడనిపించుకొని, అమృతపుదియల్లో అసువులుబాసారు.

శాస్త్రిగారిది మామూలు మరణమనడానికివీల్లేదు. రోజుకు 24 గంటలైతే, 15-20 గంటలసేపు వదునగాపని, రోజుల పర్యంతం మంతనాలు. విశ్వశాంతి పథంలో విశ్రాంతి లేకుండా, ఎడతెరిపి లేకుండా అహరహమైన శాంతి చర్చలకు శాస్త్రీజీ ఆహుతైనాడు, ఆత్మార్పణచేశాడు. భారత దేశానికి సంబంధించి నెహరూ వొక చెడు సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టి వెళ్ళాడనే చెప్పవల్సివుంటుంది. ఆరోగ్యాన్ని సైతం లక్ష్యంచేయకుండా, వళ్ళుమర్చిపోయి పని చేయడం, కనీసం అలుపుకూడా తీర్చుకోకుండా అహర్నిశలూ కర్తవ్య నిర్వహణలో మునిగిపోవడం—అనేది ఎప్పుడూ ఎవరికీ మంచిదికాదు. ప్రత్యేకించి దుర్బలుడైన, రెండుసార్లు గుండెజబ్బుకు గురిఅయిన శాస్త్రిగారికి మంచిదికాదు. ఇంతగా క్షణం విశ్రాంతిలేకుండా గంటలపర్యంతం, రోజుల పర్యంతం తీవ్రమైన, జటిలమైన చర్చల్లో పాల్గొనకపోతే, తన హృదయమంతాపెట్టి గురుతరమైన యీ బాధ్యతాయుత శాంతి చర్చల్లో పాల్గొనకపోతే యింత హఠాత్తుగా అసువులుబాసేంతటియీ విపరీత సంఘటన జరిగివుండవచ్చు.

పాశ్చాత్యదేశాల్లో ప్రధానమంత్రులు, బాధ్యతాయుత పదవుల్లోవుండే నాయకులు అప్పుడప్పుడూ నెలకొకసారైనా తరచు ఏకాంత ప్రశాంత ప్రదేశాలకువెళ్ళి విశ్రాంతి తీసుకునే అలవాటుంటుంది. మన దేశంలో కనీసం ప్రధానమంత్రులకైనా యీ అలవాటుకు నోచుకోకుండా అహర్నిశలా దేశీయ విదేశీయ కార్యకలాపాల్లో, కర్తవ్యవిధుల నిర్వహణలో నిమగ్నులై వుండవల్సిరావడం శోచనీయం. ఏమైను ఉంటే యేం శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రీ మనకిక లేడు, మనకిక రాడు.

"చిన్నమనుషులుకూడా పెద్దపనులు చేయగలరు." అనేసూక్తి శ్రీ శాస్త్రిగారిపట్ల అక్షరాలానిజమైంది. శ్రీ శాస్త్రి నిజానికి ప్రధానమంత్రిగా పెద్దపనులే చేశారు. భారతజాతి ఏ పౌరుడికి యివ్వని మహోన్నతగౌరవాన్ని శ్రీ శాస్త్రిగారికిచ్చింది, గద్దెమీద కూర్చోబెట్టింది. శక్తి వంచనలేకుండా చిత్తశుద్ధితో ఆ మహత్తరమైన బాధ్యతను మోశాడు. 18 ఏళ్లలో స్వర్గీయ శ్రీ నెహరూ చేయకలిగిన, వొకవిధంగా చేయలేనివనులను తనకున్న స్వల్పవ్యవధిలో 18 నెలల్లో చేసిచూపగలిగారు శ్రీ శాస్త్రి. దేశం వెంటనే ఎదుర్కోవల్సివచ్చిన ఆర్థిక, రాజకీయ సంక్షోభ సమయాల్లో, బీజదాడుల్లో సవాలును ధైర్యంగా స్వీకరించి తన బాధ్యతను తాను అత్యంత మహిమాన్వితంగా నిర్వహించి చరితార్థుడైనాడు. ఒక చరిత్రాత్మకమైన సన్నివేశంలో కన్నుమూశాడు.

ఈ సందర్భంలో వొక అమెరికన్ విలేఖరి—వెల్లెస్ హెంగెన్—అనే ఆయన వ్రాసిన "నెహరూతర్వాత ఎవరు?" అనే పుస్తకంలో శ్రీ శాస్త్రిని గురించి వ్రాసిన 10-15 పుటల వ్యాసం జ్ఞాపకానికొస్తుంది.

ఆపుస్తకంలో నెహరూ వారసులుగా ఆయన సూచించిన మొరార్జీ, కృష్ణమీనన్, ఇందిర, పాటిల్, చవాన్, జయప్రకాశ్ మొదలైనవారెవరూ కాలేకపోయారు. ఆయన యీపుస్తకాన్ని 1963 లో కాబోలు ప్రచురించారు. అందులో లాల్‌బహదూర్‌ను గురించిన వ్యాసం యీ సందర్భంలో చదువతగినదిగా వుంది. (మనదేశంలో యీ రకంగాకూడా వొక దుస్సాంప్రదాయం వుంది. మనదేశంలో ఎవరూ ఎవర్నిగురించీ పుస్తకాలు వ్రాయరు. అదే పాశ్చాత్యదేశాల్లోఅయితే ప్రధానమంత్రులు గురించి పలువురు పలురకాల పుస్తకాలు వ్రాసివున్నారు, వారివారి వ్యక్తిత్వాలనుగురించి పలువిధాలు అంచనాలుకట్టివున్నారు. ఈమార్గంలో అభిలాష కలిగినవారు శ్రీ హెంగెన్ వ్రాసిన్నగ్రంథాన్ని చదువవచ్చు)

"భారతీయ హృదయానికి, యీభూతలానికి చాలాదగ్గరిమనిషి శ్రీశాస్త్రి. ఎంతో వినయం కలిగినవ్యక్తి, పబ్లిక్ అన్నట్లు వినయం వుండకతప్పనివ్యక్తి. సౌమ్యుడని

—కొరవ 6వ పేజీలో

## వారం... వారం...
### దేశభ్రమ్మరి

## * టి. టి. కె. పై ఆరోపణలు విచారణ జరిగి అసత్యములని తేలడం అవసరం
## * ఈసారి అయూబ్ పలుకులలో కొంత నిజాయితీ కనబడుతుంది
## * రాజాజీకి 'శంకర్' జన్మదిన కానుక!

మన దేశంలో మితవాదులలోగాని పదవుల నాక్రమించి ఐలగాన్ని నమకూర్చు కున్నవారిలో అనేకులపై అవినీతి ఆరోపణలు సర్వసామాన్యమైనవి. పదవులనుండి వారు భ్రష్టులైన తరువాత, అనగా అధికారాంతమునందు, కృత్యాకృత్యములు వెనకటి ఆరోపణలమాట తలపెట్టక తమ ఆరాధ్య దైవముల గుణగణాల్ని స్తోత్రంచేస్తూ, ఆ దైవములపై దూకేవారిని దుయ్యబడుతూ కాలక్షేపం చేయడం పరిపాటియైనది.

కానిపదవిని విసర్జించిన మన కృష్ణయ్య సౌభాగ్యము లెట్లున్నవో పరికించండి. ఆయనపై దూకుడు గావింపబడిన సందర్భములను అతి నిశితంగా విమర్శించి మును పటి కార్పణ్యాలను మరచి, కరుణించవలసినపక్షంకూడా ఆయన చరిత్రను వర్ణించిన వైనం గమనించండి: "ఆర్థికమంత్రిగా శ్రీ కృష్ణమాచారి అనుసరించిన విధానాలను పార్లమెంటులోనూ, బయటా, తీవ్రంగా ప్రతిఘటిస్తూవున్న పార్టీలలో కమ్యూనిస్టుపార్టీ ఒకటి. గత వర్షాకాలపు పార్లమెంటు సమావేశంలో 'గుత్త పెట్టుబడిదారీ పిఅంటుగావ్యవహరిస్తున్నావు'అని

> ఈ శీర్షిక తాష్కెంట్ చర్చలు పూర్తి కాకముందు వ్రాసింది అయినా, అవి ఈ సారి సఫలం కాగలవనే నమ్మకాన్ని రచయిత పలుసార్లు వ్యక్తంచేశాడు. చర్చలు పూర్తయి, మారిన ఈ పరిస్థితుల్లో కూడా ఈ శీర్షికలో ఆ సమస్యనుగూర్చిన చర్చ అనందర్భం కాదనే దృష్టితో ప్రకటిస్తున్నాము. —సం. జ. రై.

కమ్యూనిస్టుపార్టీప్రతినిధులు శ్రీ కృష్ణమాచారిని దుయ్యబట్టడంతో ఆయన కమ్యూనిస్టుపార్టీపై విరుచుకపడడం,తత్ఫలితంగా జరిగిన తీవ్ర వాగ్వివాదం అందరికీ తెలుసును."

ఇంకా వినండి: "లోగడ కేంద్ర వాణిజ్య మంత్రిగా విలాసవస్తువులతోసహా బహువిధ విదేశీ సరుకుల దిగుమతులకు లైసెన్సులను గుత్త వ్యాపారవర్గాలకు రెండు చేతులా పంచిపెట్టిన జాతీయ వ్యతిరేక విధానాన్ని ఆనాడు నిశితంగా ఖండించింది కమ్యూనిస్టుపార్టీయే. విదేశీ కంపెనీల ఏజన్సీలు సంపాదించిన ఆయన కంపెనీ వ్యవహారాలను కమ్యూనిస్టుపార్టీ పత్రికలు బయటపెట్టిన విషయంకూడా అందరెరుగునుగదా."–(విశాలాంధ్ర', 4 జనవరి 1966).

ఈ నూతన సంవత్సర కానుకేకాదు, 'స్వ్యాపిట్' (ఇండియా), ప్రావ్దా (రష్యా) పత్రికలు కృష్ణయ్య నిర్గమనానికి అందోళన చెందినవి. ఈ నష్టానికి పరిహారంగా కొత్త ఆర్థికమంత్రిని రెండుమాస్కో ప్రయాణాలు చేయిస్తే సరిపోతుంది.

పాత-కొత్త మంత్రుల పూర్వరంగాలు రమారమి ఏకమే. అందువలన కొత్తాయన పాతవానివలె మెత్తబడి కలిసిరావనుకోవడానికి కారణం కన్పించదు. ప్రచారం కోసం పాతాయనను తిట్టినట్టుగానే, కొత్తవానిని గట్టిగా బెదిరించవలెను. (అప్పుడే అది అడ్యాన్సుగానే ఆరంభమైనది). తదుపరి రాజీనడుస్తుంది.

ఆ నాటకమట్లా వుండండి. ప్రధాని న్యాయంగా ఆరోపణలను పరిశీలించక పోవడం అనే మిషతో రాజీనామాయిచ్చి వెళ్ళిన మంత్రిమీద ఆరోపణలపై యిక విచారణ లేనట్లేనా?–అని లోకులడుగుతున్నారు. పెద్దలంతాకలిసి తమలో ఒకర్ని

—తరువాయి 10 వ పేజీలో

### తాష్కెంట్ నవ సూత్రాలు

10 తేది తాష్కెంటులో ప్రధాని శ్రీ శాస్త్రి, పాకిస్థాన్ అధ్యక్షులు శ్రీ అయూబ్ ఖాన్ సంతకాలు చేసిన ఒడంబడికలోని తొమ్మిదిసూత్రాలు–

(1) ఇరుదేశాల సమస్యల పరిష్కారానికి బలప్రయోగం కూడదు. కాశ్మీర్ విషయంలో తమ తమ మూల వైఖరులకు భిన్నంకాకుండా, శాంతియుత పద్ధతులను అనుసరించాలె.

(2) ఫిబ్రవరి 25 తేదీ లోపల తమతమ సైన్యాలను ఆగస్టు 5 తేదికి ముందువున్న స్థానాలకు తరలించాలె.

(3) యుద్ధ విరమణను అక్షరాలా పాటించాలె. ఒకొకరి అంతరంగిక విషయాలలో ఇంకొకరు జోక్యం కల్గించుకోకూడదు.

(4) పరస్పర దుష్ప్రచార ధోరణులకు స్వస్తిచెప్పి, స్నేహ సంబంధాలు పెంపొందే ప్రచారానికి ప్రోత్సాహమివ్వాలె.

(5) దౌత్యసంబంధాలను ఇరుపురూ పునరుద్ధరించు కోవాలె.

(6) వ్యాపార, రవాణా, ఆర్థిక సంబంధాలను పునరుద్ధరించు కోవాలె. సాంస్కృతిక కార్యకలాపాలను పెంపొందించుకోవాలె.

(7) యుద్ధఖైదీల మార్పిడికి తమ తమ అధికార్లకు ఆదేశాలివ్వుకోవాలె.

(8) కాందిశీకుల సమస్యల విషయంలో చర్యలు జరుపుకోవాలె. వలసల నిరోధానికి చర్యలు తీసుకోవాలె. యుద్ధసమయంలో స్వాధీనం చేసుకున్న ఆస్తిపాస్తులను తిరిగి యిచ్చివేసుకోవాలె.

(9) ఉభయ దేశాలకు సంబంధించిన పున్నత, తదితర స్థాయిల్లో యిరువురి సమస్యలను చర్చించుటకు సమావేశాలు జరుగుతుండాలె. ఇండియా–పాకిస్థాన్ సంయుక్తసంఘాల నియామకంజరిగి, తీసుకోదగిన చర్యలను గూర్చి సూచిస్తుండాలె.

ఇవి ఆ సూత్రాలు. ఈమాత్రం ఒడంబడిక కుదరడమే చాలగొప్ప అంటున్నారు విషయజ్ఞులు. వీటిపై వ్యాఖ్య తర్వాత.

## లోకసంచారి

## ★ వియత్నాం విషయంవలెనే మన సమస్యనూ అమెరికా ఆలోచించాలె
## ★ రష్యావాణిజ్యం—అమెరికా ఆహారం

పాక్ – భారత కలయిక వినికిడితో చైనాకు నిద్రపట్టలేదు. ఒక పాక్ విలేఖరి ద్వారా, ఇండియామీద చైనా జారీచేసిన ఒక బలర్దస్తీ నోటీసును తాష్కెంట్‌లో వ్యాపింపచేయడంజరిగింది. నిజంగా తాష్కెంట్‌లో భారత–పాక్ మానసాలు కలిసి వుంటే ఈ నోటీసులు ఆ కలయికను మరింత గట్టిపరచగలవు.

ఈ సమయంలో అమెరికా – రష్యాలు రెండూకలిసి మనకూ–పాక్‌నాయకులకు సాయపడవలెను.

వియత్నాంలో శాంతికోసం బరాసను, అందులోని అనేకరాజ్యాలను ప్రతిమలాడుకోవడంలేదా అమెరికా? పోప్‌వంటివాడు చైనా, ఉత్తరవియత్నాం అధిపతులకు విజ్ఞప్తిచేయలేదా? ఇదంతా యెందుకు చేయడం? ఈ శాంతియాత్రల తాత్పర్యమేమిటది? అవల చైనాఅనే పెనుభూతాన్ని ఎదుర్కోవడం – ఈ వల దారుణమైన హింసాకాండను మాన్పించడం.

మన ఉపఖండంలోనూ అమెరికా అదే విధంగా ఆలోచించవలెను. తాష్కెంట్ ప్రయత్నాన్ని హర్షించి, అది ఫలించడానికి అమెరికా దోహదమియ్యవలెను. ఇక్కడ తన నిజాయితీని అమెరికా ప్రదర్శిస్తే, వియత్నాంరంగంలో అందుకు ప్రతిఫలం తప్పకవస్తుంది.


• • •

ఈ సమయంలో రష్యా వైపునుంచి వాణిజ్యరీత్యా, పాశ్చాత్యుల వైపునుంచి ఆహారపు రవాణారీత్యా మనకు సౌకర్యం లభ్యంగావడం ముదావహం.

ప్రస్తుతం మనకూ – రష్యాకూ మధ్య జరిగే వ్యాపారం రెండువైపులాకలిపి 150 కోట్ల రూపాయల విలువగలది. 1970 లో ఇది రెండింతలవుతుంది—అనగా 300 కోట్ల రూపాయల విలువగలదిగా అవుతుంది. మనదేశంనుంచి రష్యా తెప్పించుకునే సరుకులు కేవలం ముడిసరుకులుకావు; యంత్రాలద్వారా తయారైన వస్తువులు; యివి 40 శాతం. మనకు రష్యాయిచ్చే యంత్ర సామగ్రిని మన తయారీ సామగ్రిద్వారా, ప్రతిసంవత్సరం యింత అనిగాక, పది సంవత్సరాలలో మొత్తం ఏదో విధాన చెల్లించవచ్చును. ఎగుమతి నిరాటంకంగా సాగే నిమిత్తం ప్రత్యేకంగా నిర్మాణమైన

—తరువాయి 9-వ పేజీలో


## సంక్రాంతికివే మా శుభాకాంక్షలు!



మ్యాసీ — ఫెర్గూసన్ పరికరములు "ట్రైలర్‌నిర్మితములు - మ్యాసీ — ఫెర్గూసన్ వారి 1035 ట్రాక్టరు మరియు పరికరము ఫెర్గూసన్ పద్ధతి ద్వారా ఒకే అంతర్లీన యంత్రాంగముగా రూపొందింపబడినది. మ్యాసీ— ఫెర్గూసన్ సాధనములతో మీ వ్యవసాయ క్షేత్రములు సంపన్నము గావించినచో మీకు పుష్కలముగా సశ్యవృద్ధి చేకూరును.

మ్యాసీ — ఫెర్గూసన్‌వారికడ అతివిస్తృతమైన పరికర పరంపరమున్నది. అల్లకమువలె దేశమంతటా నిండియున్న డీలర్లు వీనిని ప్రోత్సహించుచున్నారు.

TAFE
MASSEY-FERGUSON

ప్రయోగ ప్రదర్శనకొఱకు సంప్రదించండి
మెసర్సు యం. జి. బ్రదర్సు
నెల్లూరు - చిత్తూరు జిల్లాలకు మైన్‌డీలర్సు
పొగతోట—నెల్లూరు
ఫోన్ : 306.

ప్రత్తిపంట : స్వీయానుభవాలు-4

# వచ్చే తెగుళ్లు- వాడవలసిన మందులు

శ్రీ ఆల్తూరు కోటారెడ్డి బి. ఎస్‌సి.

ప్రత్తిపంటకు సంబంధించిన మందుల వ్యవహారాలనుగూర్చి యీ వారం వివరిస్తానని చెప్పాను. విత్తిన మూడు వారాలకు మొక్కలలో కొమ్మ విప్పి కనపడగా ఒక పౌన్ను పెరాతియాన్ 6 గ్యాలన్ల నీటిలో కలిపి కొట్టించాను. విత్తిన ఐదోవారంలో ఫూస్ఫామార్ (కాపర్ ఫంగిసైడ్) వొక పౌనుమందును 20 గ్యాలన్లనీటిలో కలిపి కొట్టించాను. బోర్డో మిశ్రమం తయారు


రత్నలోకం

చేసి కొంతభాగంలో కొట్టించిచూడగా యీ కలిపిన బోర్డో మిశ్రమమే బాగావని చేసినట్లు అనిపించింది. అయితే అది తయారుచేయాలంటే వోపిక అవసరం.

విత్తిన 10 వ వారంలో 50 శాతం (wettable) సెవిన్ మందును 1 పౌన్ను షుమారు 8 గ్యాలన్ల నీళ్ళతో కలిపి వాక స్ప్రేయర్‌కు పట్టేనీటిలోకలిపి కొట్టించాను. తర్వాత షుమారు రెండువారాలకొకసారి పెరాతియాన్, పాలిడాల్, సెవిన్ (10 శాతం) మందులను మార్చి మార్చి పిచికారి చేయిస్తూవుండినాను. విత్తిన 16 వ వారంలో ఫూస్ఫామార్ మందును పెరాతియాన్ కొట్టినప్పుడు దానితోకలిపి కొట్టించాను. మొత్తం 10 సార్లు పిచికారి చేయించాను. సెవిన్ 10 శాతం ఎకరానికి షుమారు 12 కిలోగ్రాములు పట్టింది.

కాయ, పూత, పిందెని తొలిచే పురుగులకు అద్భుతమైన అస్త్రంవంటిది. వర్షాలు లేకుంటే 15 దినాలు పనిచేస్తుంది. సెవిన్ కొడితే నక్కదోమ లేక తెల్లపాడ లేక బంక (Mite attack) వస్తుందని, అందులో గంధకం కలిపి కొట్టించాలని చాలా ఆలస్యంగా వ్యవసాయశాఖవారు తెలియచేశారు. నేను మొదట సెవిన్ గంధకం కలపకుండానే పిచికారి చేయిస్తే బంకలేదు. బంక వస్తుందనేభయంతో రెండవదఫా గంధకంకలిపి కొట్టించాను. కొంతప్రదేశంలో సెవిన్‌లో గంధకం కలుపకుండానే వొట్టి సెవిన్ మాత్రం కొట్టించాను ఎక్కడా బంక లేదు. ఏ2 1కెఎఫ్, బంకకు ఏమైన రెసిస్టెంటేమో అనిపించింది.

—తరువాత 8 వ పేజీలో



ఆ కళ్లలో సాహసం, ధీమా, రాజసం ఉట్టిపడుతున్నాయి. బాగాచూడండి పెద్దపులిని

# అడవులు - అగాధం

## అంధకారంలో విచిత్రానుభవాలు

మీరు చీకటి రాత్రిళ్ళలో అడవులను చూడాలనివుందా?

నాతోరాండి, నా స్నేహితుడు నన్ను మిర్జారాజాను పరిచయం చేస్తాను. ఆయన జీపులోనే వెళ్దాం. తెచ్చిన 10 గాలన్ల పెట్రోలు పోసేద్దాం. 150-200 మైళ్ళ దాకా తిరగాలిరాత్రి. చలి చాలా ఎక్కువగా వుంటుంది. తలకు వున్నిటోపీ, చేతులకు తొడుగులుకూడా వుండాలి. ముందు రాజాసాహెబ్‌గారి ఆతిథ్యాన్ని స్వీకరించి; దారిలో ఎక్కడైనా విశ్రాంతి తీసుకొని తినేదానికిగాను రొట్టెలు, గడ్డపాలు (Condensed milk), ఉడకబెట్టిన గుడ్లు, ఉప్పు, మిరియాలపొడి, తలావొక ఫ్లాస్కునిండా కాఫీ పోసుకొని బయలుదేర్దాం. రాజాసాహెబ్‌గారింటిలో ప్రత్యేకత వుంటుంది, ఎప్పుడూ. అంటే మనం ఇదివరకెన్నడూ రుచిచూడని పదార్థాలను బల్లమీద వుంచుతాడు. ఇది అడవిపంది మాంసపు పూరగాయ అంటాడు. తినే అన్నం (Bamboo Rice) వెదురుబియ్యం అంటాడు. పచ్చడి వెదురు చిగుళ్ళతో చేసిందంటాడు. కూరల్లోవేసింది కొత్తిమీర కాదు అడవుల్లోదొరికే ఓరకమైన ఆకు కాడు. ఈ స్వీట్ మావూరి ప్రత్యేకత అయినప్పుడాపిష్ఠా-అంటూనే రకరకాల పదార్థాలను బల్లమీద వుంచుతాడు.

అడవుల్లోని బాటలన్నీ రాజాగారికి కరతలామలకం. ఎక్కడ ఏ జంతువులు తరచుగా కన్పించేదీకూడా వారికి తెలుసు. అందుకని వారే డ్రయివ్ చేస్తారు. వారి 500 Express Rifle కూడా ప్రక్కనే సిద్ధంగా వుంటుంది. మధ్యన మీరు కూర్చోండి; కుడివైపున నేనుంటాను నా రైఫిల్‌తో. వెనకసీట్లో ఇద్దొకరుఅదొకరు శక్తివంతమైన సర్చ్ లైట్లు వేస్తుంటారు. మనం జీపులో నిశ్శబ్దంగావుండాలిఅన్నారు.

అయిదుమైళ్ళు సాగాం. మన జీపు లైట్లలో రోడ్డుకు మధ్యన నిప్పు కణికలా ఒకేకన్ను కన్పిస్తుంది. అదేంకాదు, అగ్గి


**డాక్టరు**
**పి. సీతారామరావు**

గువ్వలనే చిన్న పిట్ట. జీపును దగ్గరగా రానిచ్చి ఎగిరి ఆ పొదమీద వాలితే మళ్ళీ అదేకన్ను కన్పిస్తుంది. వెనక కుడివైపు నున్నాయన అలపేశాడు; తటాలున కారు నాపి వెనక్కు రానిచ్చారు. లైట్లలో ఎన్నో జంతువుల కళ్ళు కన్పిస్తున్నాయి. అవి లేతాకుపచ్చా? లేక నీలి రంగా? ముందరి దానికి పెద్దకొమ్ములున్నాయి. ఇవి పొడదుప్పులు. ఏమిటీ వెలుతురని పరిశీలిస్తున్నాయి. ఈ దుప్పులకు ఆపేక్ష, కుతూహలం జాస్తి. అదే వీటికి ప్రాణ కంటకం కూడాను.

—తరువాత 10-వ పేజీలో



అడవుల్లో, అంధకారంలో, అగాధంవద్ద ఆగ్రహంతో అలజడి కల్గించిన ఏనుగు



మన విద్యార్థులను చూచి మనం గర్విస్తున్నాం. దేశం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోందని వారికి తెలుసు. వారు తమ పాత్రను నిర్వహించడానికి త్వరపడ్డారు. ఎన్.సి.సి.లో చేరి రక్త దానమును చేస్తామని ముందుకు వచ్చారు. దేశరక్షణ కార్యములలో పాల్గొని దేశరక్షణ నిధికి విరాళాలు పోగు చెయ్యడానికి సహాయపడ్డారు. ఇన్ని పనులు చేస్తున్నప్పటికి తమ చదువును అశ్రద్ధ చేయలేదు. ఎందుకంటే దేశానికి తమ శక్తి సామర్థ్యములు అవసరమని వారికి తెలుసు. అవును నిజమే. మన విద్యార్థులు దేశానికి సేవ చేస్తున్నారు! మీరు చేస్తున్నారా?

భారత దేశం ఒక్కటే
భారత ప్రజలు ఒక్కటే

DA 65/F 11

